# మహా ఇల్లాలు

రోశాం యానాదిపిల్ల. చిన్నతనంనుంచీ మాయిళ్ళలోనే పెరిగింది. అ సమానం మా యిళ్ళలోనే ఉండేది. గుడిసెకుపోతే చుట్టపుచూపుగా ఏమన్నా పొయ్యేదేమో. మాయింటో, తప్పితే సీతయ్యగారియింటో, తప్పితే కోమటిదుకాణంమీద. మరోచోటికి పోయి ఎరగదు. ఈ మూడిళ్ళలోనూ పనిచేసేది. మూడిళ్ళలోనూ తిండితినేది. రాత్రి పూట ఎవరో ఒకరి పంచన పడుకునేది.

"చేసుకున్న అమ్మకు ఒకటేకూర, అడుక్కున్న అమ్మకు అన్నికూరలే," అనేది మా అమ్మ.

"చిన్నతనం. నిర్విచారంగా వుంటుంది, ఏపని చెప్పినా ఆడుతూ పాడుతూ చేస్తుంది." అనేది సీతయ్యగారి పెళ్ళాం.

"ఏ జనమలోనో పాపంజేసి సూద్దరాళ్ళయి పుట్టటంగాని, అసలు అళ్ళకున్న సుకం మన కేణ్ణించొస్తుందీ?" అనేది కోమటావిడ.

రోశాం అంట్లు తోమేది, దొడ్డి ఊడ్చేది, బజారుకెళ్ళి అదీ ఇదీ పట్టుకొచ్చేది. బట్టలు ఉతికేది, అది ఉతికిన బట్టలమీద నాలుగుచుక్కలు పవిత్రోదకం చల్లి మా వాళ్ళు ఆరేసుకునేవాళ్ళు.

ఏ కారణంచేతనన్నా రోశాం ఒకరోజు రాకపోతే మా వాళ్ళకి చాకిరి ఎంత చేసినా తెమిలేదికాదు. అయితే ఏం, దాన్ని అందరూ ఎంతో ఆపేక్షగా చూసేవాళ్ళు.

మేం దానికి నెలకి పావలా ఇచ్చేవాళ్ళం. సీతయ్యగారు యింకో పావలా అల్లా ఇచ్చేవాడు. కోమటాయన ఏమీ ఇయ్యకపోయినా రోశాం తల్లికి ఎప్పుడన్నా ఓ దమ్మిడీ ఉప్పుపెట్టేవాడు. రోశాం తండ్రికి ఒకటీ రెండూ అప్పుపెట్టి నెలకు రూపాయికి అణాకంటె వడ్డీ తీసుకునేవాడుకాడు. వ్యాపారం చేసుకునేవాళ్ళకిమటుకు అభిమానాలుండవెట్టా?

ఎప్పుడన్నా మా యిళ్ళల్లో బొత్తిగా చిరిగిపోయిన బట్టలుంటే, అవతల పారెయ్యకుండా దానికే ఇచ్చేవాళ్ళం. తిండిపెడుతూనే ఉంటిమాయె. ఇకదానికి ఖర్చేముందీ? ఏడాదికి నికరంగా ఆరురూపాయలూ వెనకేసిందన్నమాటే. ఈ లెక్కచూసి ఓసారి కోమటావిడ విరుచుకుపడి పోయినంత పనిచేసింది.

రోశాంతండ్రి వొట్టి పాపిష్టిముండాకొడుకు, తాగేసేవాడు. అందుచేత దాని తల్లి, కూతురి జీతండబ్బులు మావాళ్ళదగ్గిరే దాచుకుని అవసరమైనట్టు తీసుకునేది.

భగవంతుడు అటువంటి వాళ్ళను కనిపెట్టి ఉంటాడు గామాలు. రోశాం ఎన్నడూ మంచానపడి ఎరుగదు. ఎప్పుడన్నా తలనొప్పి, జ్వరమూ వచ్చినా దానికి లెక్కలేదు. అందుచేత దానిచేత మామూలు ప్రకారం పని చేయించుకునేవాళ్ళం. అది కూడా ఎంత జ్వరమైనా ఖాతరు చెయ్యకుండా మామూలు పనులన్నీ చేసేది.

మా నాన్నగారు డాక్టరై ఉండికూడా ఇంట్లో మాకొచ్చే రోగాలకు మందివ్వటానికి విసుక్కునేవారు. "ఆ ముండను చూడండర్రా, దానికేం మందుకావాలి? అన్ని మందులూ మనకే!" అనేవారు.

తక్కువ కులంది గనక, ఏ వస్తువన్నా చప్పున కనిపించకపోతే సహజంగా "ఆ రోశాం ముండ ఎత్తుకుపోయిందేమో." అని అనుకునేవాళ్ళమన్న మాటేగాని అది ఎన్నడూ యదార్థంగా దొంగతనం చేసి ఎరగదు. ఇంటో ఉండే వెండిసామానూ, నగలూ, అక్కడక్కడా పెట్టిన చిల్లరడబ్బులూ, అది ఎన్నడూ ముట్టుకోకపోగా జాగ్రత్త చేసిపెట్టేది కూడానూ. అటువంటి బుద్ధి పనిచేసేవాళ్ళలో అరుదు.

పెళ్ళయేవరకూ రోశాం మా యిళ్ళలో పనిచేస్తూనే ఉందనుకోండి. దానికి పెళ్ళయితే మాయింటో మనిషికి పెళ్ళయినట్టే ఉంది. అమ్మ దానికో రూపాయిన్నర చీరా, నాలుగణాల గుడ్డకూడా పెట్టింది. పెళ్ళయిన ఏడాదికల్లా అది పిల్లాణ్ణెత్తుకొస్తే అమ్మ మళ్ళీ పిల్లాడిచేతిలో అణా పెట్టింది.

"నువ్వెళ్ళావు, మళ్ళీ యింటికి అనువయిన పనిమనిషి దొరకలేదే!" అన్నది అమ్మ.

"అదేం దమ్మగారూ!" అన్నది రోశాం ఆతుర్దాగా.

"ఆఁ? అంతా, రూపాయిస్తావా? రెండిస్తావా? అని అడిగే వాళ్ళేనే! రూపాయలు పోగేసుకున్నామా?" అన్నది అమ్మ.

"రోజులు మా కుండిపోతాన్నయ్యమ్మా!" అన్నది రోశాం....

రోశాం మొగుడు మావూళ్ళో చేరటంతో రోశాం మళ్ళీ మాకు దగ్గిరయింది. పనిలోకి వస్తుందేమోనని ఆశపడ్డాంకూడా. కాని రోశాం మొగుడు అదోరకం మనిషి. దానికి తగ్గవాడు కాడు. వాడికి పొగరు, మేమంతా డబ్బున్నవాళ్ళమని వాడికి కడుపుమంట. తనక్కూడా మేడలూ మిద్దెలూ లేవని ఏడుపేమో! అందుచేతే వాడికి ఎక్కడా కుదురుగా నౌకరీ చేసుకునే గీతలేదు. రోశాంవంటి మంచిముండకు అటువంటి నిర్భాగ్యుడు దొరకటం చాలా విచారకరం....

మంచివాళ్ళకి కాలంకాదు. అందుచేతనే రోశాం, పాపం, అన్ని ఇక్కట్లు పడ్డది. ముందు దాని మొగుడికి ఉద్యోగం పోయింది. ఏదో నాలుగు రాళ్ళు తెచ్చుకుంటున్న వెధవ ఊరికే ఉండగూడదూ? సమ్మెలుట, సమ్మెలు!

వాడికి ఓ చెంప ఉద్యోగం పోయిఉన్న స్థితిలో రోశాం పెద్దపిల్లవాడికి రోగం వచ్చింది. ఇంట్లో ఏ పూటకూడా ఓ గింజలేదు. దానికా చాకిరిలేదు. ఎట్లా గడుస్తుందీ?

ఎవరిస్తా రేమిటి? ఎందుకిస్తారు? రెక్కాడితేనే డొక్కాడుతుంది. పిల్లవాడికి మందూ మాకూ లేదు.

మాయింటో యింటిమనిషల్లే పెరిగిన పిల్ల ఇన్ని అగచాట్లు పడుతూంటే మాకు కష్టంగానే ఉందిమరి. కాని ఎవరిరాత ఎవరు తప్పిస్తారు గనకా? కాని అంత ఇబ్బంది లోనూ అది దేహి అని ఎవర్నిగానీ అడిగిందా? అదెంత మహాఇల్లాలో! ఒకవేళమేం ఇచ్చినా తీసుకుని ఉండేదికాదు. సందేహంలేదు.

కష్టాలు ఒంటరిగా రావుగదాని మొదట్లో దాని మొగుణ్ణి ఎరెస్టుచేసి తీసుకు పోయినారు. మర్నాడే పిల్లాడు చచ్చాడు. ఆ తరవాత రోశాం మంచం పట్టిందని తెలిసింది. చూసేవాళ్ళు లేరు. కాచిపోసేవాళ్ళు లేరు. ఎంతకాలం బతుకుతుందీ ?

"నీకీ పాడు ప్రపంచంతో రుణం తీరిపోయింది, నా వెంటరా," అని భగవంతుడే దాన్ని తీసుకుపోయినాడు.

దానిపేర ఆ రెండో నలుసు మాత్రం బతికి ఉన్నాడు. వాణ్ణి ఎవరో దగ్గరికి తీసి సాకుతున్నారట. అన్నిటికి ఆ భగవంతుడే దారి ఛూపిస్తాడు. భూమ్మీద నాలుగు మెతుకులు ప్రాప్తం ఉండాలేగానీ, ఏ దేముడో, ఏ ధర్మరాజో ఆదుకోక పోడు....

ఏమయినా అదిమాత్రం మహాఇల్లాలు. దానికి మళ్ళీ జన్మంటూ ఉండదు. అది పోయిందంటే మా మూడిళ్ళవాళ్ళకీ ఏదో సొంతమనిషి పోయినట్టే ఉందన్నమాట. అభిమానాలు గుణాన్నిబట్టి రావాలిగాని కులాన్నిబట్టి వస్తాయా ఏం ?

—ప్రచురణ : తల్లిలేనిపిల్ల కథల సంపుటిలో, డిశంబరు, 1947.